

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 26-04-2025 | సంపుటి - 22 సంచిక - 361 రూ : 4 పేజీలు: 8


## నేడు పోప్ అంత్యక్రియలు

- రోమ్‌కు చేరుకొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రోమ్: వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో శనివారం పోప్ ఫ్రాన్సిస్ (88) అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారమే రోమ్‌కు చేరుకున్నారు. గత సోమవారం మృతిచెందిన పోప్ అంత్యక్రియలకు ప్రపంచ దేశాల అధినేతలు,

తరువాయి 2లో






## బ్యాంకు లింకేజీ ఉంటేనే.. యువతకు ఉపాధి యూనిట్లు

- రాజీవ్ యువ వికాసంలో తప్పనిసరిగా అమలు

**హైదరాబాద్:** రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు చేసే యూనిట్లకు బ్యాంకు లింకేజీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాయితీ పోను మిగతా వాటా భరించేందుకు లబ్ధిదారు సిద్ధంగా ఉన్నా యూనిట్లు మంజూరు చేయకూడదని నిర్ణయించింది. పథకం అమల్లో పారదర్శకత పెంచేందుకు, నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా సంక్షేమాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. క్షేత్ర స్థాయిలో పరిశీలన తర్వాత అర్హుల జాబితాను బ్యాంకర్లకు పంపించి, ఆ యూనిట్లకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి చేయాలని సూచించింది.

తరువాయి 2లో

## భూముల చిక్కులకు చెక్..

- పైలట్ మండలాల్లో 30 శాతం సాదాబైనామా సమస్యలు
- జూన్ 2లోపు ఆ మండలాల్లో సమస్యలు తీర్చేస్తాం
- జూన్ 2-ఆగస్టు 15 మధ్య రెవెన్యూ సదస్సులు



2లో

## అక్షయపాత్ర అమరావతి

- ప్రధానికి వివరించిన సీఎం చంద్రబాబు
- పునఃప్రారంభానికి రావాలని మోదీకి ఆహ్వానం
- రాజధాని నిర్మాణంపై ప్రజెంటేషన్
- తన ఆలోచనలను పంచుకున్న ప్రధాని..
- పచ్చదనం విస్తరణకు పెద్దపీట వేయాలని సూచన
- ప్రపంచస్థాయి రాజధాని నిర్మిస్తామన్న సీఎం
- ఉగ్రవాద నిర్మూలన చర్యలకు సంపూర్ణ మద్దతు

**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. రాజధాని అమరావతి పనులను ప్రారంభించడానికి రావాలంటూ ఆహ్వానం పలికారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు లోక కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి చేరుకున్న చంద్రబాబు ఆయనతో 1.15 గంటల పాటు సమావేశమయ్యారు. అమరావతి పునఃప్రారంభం2025తో కూడిన ఆహ్వాన పత్రాన్ని సమర్పించి రాష్ట్ర రాజధానిని భవిష్యత్తు అవసరాలు తీర్చే నగరంగా ఎలా తీర్చిదిద్దనున్నదీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అమరావతిని రాష్ట్రంలోని 26 జిల్లాలవాసుల అవసరాలు తీర్చే నగరంగా తీర్చిదిద్దనున్నామని వివరించారు. విద్య, వైద్యం, ఉపాధి

తరువాయి 2లో



## కూటమి నేతలమంతా మనస్ఫూర్తిగా కలిసి పనిచేస్తున్నాం

- మోదీ, చంద్రబాబు నేతృత్వంలో ప్రగతి పథంలో రాష్ట్రం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

2లో





## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం

- భారత్ సమ్మిట్‌లో తెలంగాణకు పెట్టుబడులను ఆహ్వానించాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, భారత్ సమ్మిట్ కన్వీనర్

తరువాయి 2లో



## మరోసారి పాక్‌ను ఓడించాలి

- ప్రధాని మోదీ... ఇందిరను ఆదర్శంగా తీసుకోవాలి
- పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య: సీఎం రేవంత్‌రెడ్డి
- పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ

**హైదరాబాద్:** పహల్గాంలో పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర వాదులు జరిపిన పాశవిక దాడిని ఖండిస్తున్నామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని మరోసారి పాకిస్థాన్‌ని ఓడించాలని, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ని భారత్‌లో కలపాలని ప్రధాని మోదీకి సూచించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించి నవారికి నివాళిగా, బాధితులకు సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా

తరువాయి 2లో

# మరోసారి పాక్‌ను ఓడించాలి

(మొదటిపేజీ తరువాయి)



నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఇది భావోద్వేగమైన సందర్భం. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా' అని అన్నారు. భారత్.. ప్రశాంతంగా అభివృద్ధి పథంలో వెళ్తుండటాన్ని జీర్ణించుకోలేక దేశంలోకి చొచ్చుకుని వచ్చి పర్యాటకుల ప్రాణాలు తీయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. రాజకీయాలకు, పార్టీల సిద్ధాంతాలకు అతీతంగా అంతా ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో కేంద్రానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున వేల మందితో ర్యాలీ చేపట్టామని చెప్పారు. ''అందరం ఏకమై ఉగ్రవాదాన్ని అంతమొందించి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నా. ఆయా కుటుంబాలకు అండగా నిలబడతాం. 1967, 1971లలో ఉగ్రవాదులు ఇలాంటి దాడులే చేస్తే ఇందిరాగాంధీ దీటైన జవాబు ఇచ్చారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతతో పోల్చారు. దుర్గామాత భక్తులుగా ప్రధాని మోదీ... ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి. కోట్లాది భారతీయులంతా మీకు (మోదీకి) మద్దతుగా ఉన్నారు. మరోసారి పాకిస్థాన్‌ని ఓడించాలి. ఆ దేశాన్ని రెండు ముక్కలు చేయాలి. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ని భారత్‌లో కలపాలి'' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### హాజరైన 100 దేశాల ప్రతినిధులు

పీపుల్స్ ప్లాజా నుంచి మొదలైన ర్యాలీలో యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. జాతీయ జెండా పట్టుకొని పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లింలు నలుపు రంగు రిబ్బన్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్'లో పాల్గొనడానికి వచ్చిన సుమారు 100 దేశాల ప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రజలంతా ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సెల్‌ఫోన్‌లో లైట్లు వెలిగించి తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎస్ శాంతికుమారి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, దానం నాగేందర్, ఎమ్మెల్సీ విజయశాంతి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నేతలు జగ్గారెడ్డి, వి.హనుమంతరావు, మధుయాస్కీ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, శాప్ ఛైర్మన్ శివసేనారెడ్డి సహా పలువురు పాల్గొన్నారు.

# బ్యాంకు లింకేజీ ఉంటేనే.. యువతకు ఉపాధి యూనిట్లు

(మొదటిపేజీ తరువాయి)

యువ వికాసం పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేటగిరీ 1 కింద రూ.50 వేల విలువైన యూనిట్‌కు నూరుశాతం రాయితీ ఉంది. బ్యాంకు లింకేజీ లేకుండా ఈ రుణాన్ని అమలు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. కేటగిరీ 2, 3, 4లలో యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, లబ్ధిదారు వాటా కింద బ్యాంకు రుణం తీసుకోవాలి. కేటగిరీ 2 కింద యూనిట్ వ్యయం రూ.లక్షలో పదిశాతం, కేటగిరీ 3 కింద రూ.లక్ష రూ.2 లక్షల వరకు 20 శాతం, కేటగిరీ 4 కింద రూ.2 లక్షలురూ.4 లక్షల వరకు 30 శాతం చొప్పున బ్యాంకు లింకేజీ తప్పనిసరి. గతంలో బ్యాంకు రుణాలు సకాలంలో మంజూరు కాకపోవడం, తప్పనిసరిగా లబ్ధిదారు ఇచ్చే రుణానికి పూచీకత్తు పెట్టాలని చెప్పడంతో కొందరికి యూనిట్లు మంజూరైనా, రాయితీ విడుదలైనా పథకం అమలు కాలేదు. ఈ తరహా పరిస్థితులను అధిగమించేందుకు యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, మిగతా మొత్తాన్ని సొంతంగా భరిస్తే యూనిట్ మంజూరు చేయాలన్న చర్చ జరిగింది. ఈ తరహా విధానంతో పథకం లక్ష్యం నెరవేరదని, స్వయం ఉపాధి పథకాలు పక్కదారి పట్టే అవకాశాలున్నట్లు ప్రభుత్వం భావించింది. పథకం కింద ఎంపికైన వారికి తప్పనిసరిగా బ్యాంకు రుణం ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల బ్యాంకర్లను ఆదేశించారు. రుణం కింద బ్యాంకులు రూ.1,600 కోట్లు భరిస్తే దాదాపు 5 లక్షల మందికి స్వయం ఉపాధి యూనిట్లు మంజూరవుతాయని తెలిపారు.

### బీసీ సంక్షేమ శాఖకు రూ.4,639.81 కోట్లు విడుదల

బీసీ సంక్షేమ శాఖ పరిధిలో కల్యాణలక్ష్మి, ఉపకారవేతనాల కోసం ప్రభుత్వం రూ.4,639.81కోట్లు విడుదల చేసింది. కల్యాణలక్ష్మికి రూ.2,173 కోట్లు, బీసీ, ఈబీసీ విద్యార్థుల పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాలు, బోధన ఫీజుల కోసం రూ.2,386 కోట్లు, బీసీ విదేశీ విద్యా నిధి పథకానికి రూ.80 కోట్లు ఇచ్చింది.

# భూముల చిక్కులకు చెక్..

'ధరణి' కారణంగా ఎదురైన సమస్యలన్నీ తొలగించి, భూ యజమానులకు భరోసా కల్పించేలా ఆర్వోఆర్ 2025, భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. రైతులకు, పట్టాదారులకు పూర్తిగా రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. జూన్ 2 లోపు పైలట్ మండలాల్లో రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో కొత్త చట్టంపై సదస్సులు నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కలెక్టర్ ఉదయం, సాయంత్రం ఒక్కొక్క మండలానికి వెళ్లి అవగాహన కల్పిస్తారని వివరించారు.

### * గతంలోని చట్టాలకు.. ఆర్వోఆర్-2025కు వ్యత్యాసం..

ఆర్వోఆర్ చట్టాలు 2020కి ముందు వరకు పట్టాదారులకు పూర్తి భద్రత కల్పించేలా అమలయ్యాయి. చిన్నచిన్న తప్పులుంటే సరిదిద్దారు. కానీ ఆర్వోఆర్ 2020, ధరణి ఏర్పాటు చేశాక నిబంధనలను రూపొందించలేదు. మూడు మాడ్యూళ్లతో ధరణిని ప్రారంభించి వాటి సంఖ్య 35 వరకు పెంచారు. వీటితో ఇబ్బందులొస్తే సీసీఎల్ఏ, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కువ మాడ్యూళ్లతో గందరగోళం లేకుండా భూభారతి చట్టంలో ఆరు మాడ్యూళ్లలోనే అన్ని అంశాలను పొందుపరిచాం. ధరణి కారణంగా ఏ చిన్న భూ సమస్య వచ్చినా సీసీఎల్ఏ వరకు రావాల్సి వచ్చేది. జిల్లాల్లో యంత్రాంగానికి అధికారాలు కల్పించలేదు. భూ భారతిలో తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలోనే అధికారాలిచ్చాం. ధరణిలో ఎక్కడా అప్పీల్ చేసుకునే వెసులుబాటు లేదు. కొత్త చట్టంలో ప్రతి స్థాయి నుంచి పై అధికారికి అప్పీల్ చేసే అవకాశం కల్పించాం. సీసీఎల్ఏ స్థాయి తరువాత అప్పీలు కోసం ట్రైబ్యునల్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. నాలుగు మండలాల పరిధిలో భూభారతి చట్టాన్ని ప్రారంభించాం. వెంకటాపురంలో 3,300, మద్దూరులో 382, నేలకొండపల్లిలో 395, ఎల్లారెడ్డిలో 300 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై సమీక్ష నిర్వహించగా 30 శాతం వరకు సాదాబైనామా సమస్యలున్నట్లు తేలింది. తెల్లకాగితాలు, రెవెన్యూ స్టాంపు కాగితాలపై జరిగిన సాదాబైనామా కొనుగోళ్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం ప్రజల నుంచి 9.26 లక్షల దరఖాస్తులు స్వీకరించింది. కానీ, ఆర్వోఆర్ 2020 చట్టంలో ఈ అంశాన్ని చేర్చకపోవడంతో కోర్టు ఈ ప్రక్రియను నిలిపివేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉన్న వాటిని కొత్త చట్టంతో పరిష్కరిస్తాం. భూభారతి ద్వారా పకడ్బందీ వ్యవస్థ ఏర్పాటవుతోంది. గ్రామస్థాయి నుంచీ రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. గత ప్రభుత్వంలో సీఎం.. తన బంధువులకు సంబంధించిన ఓ గ్రామంలో రెవెన్యూ అధికారి మాట వినలేదని 10,956 రెవెన్యూ గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వో, వీఆర్ఏలను ఒక్క కలం పోటుతో రద్దు చేసి.. సుమారు 4 వేల మందిని రోడ్డున పడేశారు. మేం, వీరందరికీ న్యాయం చేశాం. భూముల కార్యకలాపాలపై పర్యవేక్షణకు ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి రైతు భూమికి భూధార్ (భూ ఆధార్) సంఖ్యను ఇవ్వాలని యోచిస్తున్నాం. భూములకు కచ్చితమైన మ్యాప్‌లు లేకపోవడం దీనికి కొంత ఆటంకంగా ఉంది. మొదటి విడత పైలట్ మండలాల్లో తాత్కాలిక భూధార్ నంబరు జారీ చేశాక రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. ప్రజలు క్షేత్రస్థాయిలో ఏం కోరుకుంటున్నారని నేను ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో అడిగాను. భూమి సరిహద్దులతో పాటు మ్యాప్‌తో కూడిన పాస్ పుస్తకాలు కావాలని ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో కోరుతున్నారంటూ కలెక్టర్లు వివరించారు. ఇది మంచి పద్ధతి. మా అభిప్రాయాలేవీ ప్రజలపై రుద్దడం లేదు. దీని కోసం సర్వే వ్యవస్థ పటిష్ఠం కావాలి. గత ప్రభుత్వ పాలనలో ఆ వ్యవస్థ క్షీణించింది. ప్రైవేటు లైసెన్సున్న వారు కూడా కలిపితే.. కొన్ని పొరుగు రాష్ట్రాల్లో 10 వేల మందికి పైగా సర్వేయర్లు ఉంటే మన రాష్ట్రంలో 382 మంది మాత్రమే ఉన్నారు. మా ప్రభుత్వం వచ్చాక వెయ్యి మందిని నియమించే ప్రక్రియను ప్రారంభించాం. గణితంతో ఇంటర్ విద్యార్హత ఉన్నవారిని వివిధ పరీక్షల ద్వారా ఎంపిక చేసి సర్వే ఆఫ్ ఇండియా సంస్థతో 90 రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తాం. సర్వే రుసుం కూడా పక్క రాష్ట్రాల కన్నా తక్కువగా ఉండేలా చూస్తాం. ధరణి పోర్టల్ లోపాలను సరిచేసి.. దాన్ని ఉన్నతీకరించాం. విదేశీ సంస్థ చేతుల్లో ఉన్న పోర్టల్‌ను ఎన్ఐసీకి అప్పగించాం. భూ భారతి పోర్టల్‌ను భవిష్యత్‌కు సరిపోయేలా కొత్త సాంకేతికతతో తీసుకొచ్చేందుకు టెండర్ నిర్వహించి స్వదేశీ సంస్థకు అప్పగిస్తాం. కొత్త సాంకేతికత వచ్చాక ప్రస్తుతం ఉన్న ఆరు మాడ్యూళ్లలో దేనిలో దరఖాస్తు చేసినా సమస్య పరిష్కారం అయ్యేలా ఉంటుంది. జూన్ 2వ తేదీ నుంచి ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ భారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయబోతున్నాం. రెవెన్యూ వ్యవస్థే గ్రామాల వద్దకు వస్తుంది. ప్రజలు ఏ అధికారి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. రెవెన్యూ అధికారే మీ చేతికి దరఖాస్తు పత్రం ఇస్తారు. అందులో టిక్ పెడితే సమస్య పరిష్కారం అవుతుంది. ప్రజలు ఎక్కడా రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. గతంలో గ్రామ మ్యాప్‌లు, నక్షాలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల విస్తీర్ణం పెరగడంతో వాటి స్వరూపమే మారిపోయింది. దీనిపై సర్వే ఆఫ్ ఇండియాతో చర్చించాం. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో కూడిన 10 ప్రాంతాల్లో నమూనా కార్యాచరణ చేపడతాం. ఏరియల్ ఫొటోలు, పాత మ్యాప్‌లు బేరీజు వేసి, సరిహద్దులు నిర్ధరిస్తాం. క్రమేపీ అన్ని రెవెన్యూ గ్రామాల్లో అమలు చేస్తాం.

# అక్షయపాత్ర అమరావతి

(మొదటిపేజీ తరువాయి)



అవకాశాలు కల్పించే అక్షయపాత్రలా తయారు చేయాలన్నది ముఖ్య ఉద్దేశమని చెప్పారు. 2015 అక్టోబరులో ప్రధాని చేతులమీదుగా శంకుస్థాపన చేసుకున్న రాజధాని నిర్మాణం తదనంతర పరిణామాల కారణంగా ఎలా నిలిచిపోయిందీ వివరించారు. ఇప్పుడు కేంద్రం అందిస్తున్న ఆర్థిక చేయూతతో ఎలా పునఃప్రారంభించబోతున్నట్లు వివరించారు. పర్యావరణం, పౌరజీవనం మధ్య సమతౌల్యం పాటిస్తూ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ గురించి ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తన ఆలోచనలను పంచుకున్నారు. రాజధాని ప్రాంతంలో పచ్చదనం విస్తరణ కోసం జపాన్‌లో అనుసరిస్తున్న మియావాకి విధానం గురించి చెప్పారు. వేగంగా పచ్చదనం విస్తరింపజేయడానికి ఈ విధానం బాగా ఉపయోగపడుతుందని సూచించారు. వాటన్నింటినీ ఆచరణలో పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానికి హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి గురించి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన తర్వాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి పుంజుకొని క్రమంగా పట్టాలెక్కుతోందని వివరించారు. రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణం, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వపరంగా మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు చెప్పారు. బీపీసీఎల్ ఆరామ్‌కోల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయబోయే ఈ రిఫైనరీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ఎలా సానుకూల ప్రభావం చూపబోయేదీ చెప్పారు.

### ఉగ్రవాద నిర్మూలనలో కేంద్రానికి మద్దతు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానిని కలిసిన వెంటనే పహల్గాం ఉగ్రవాద దాడి గురించి మాట్లాడారు. ఆ దుర్ఘటన అనంతరం తీసుకున్న చర్యలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ దుర్ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా నిలిచినట్లు వివరించారు. దేశభద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రబాబు వెంట కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. గతంలో ప్రధానిని కలిసినప్పుడు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించడం, శాలువాతో గౌరవించడం వంటివి చంద్రబాబు సంప్రదాయంగా పాటించేవారు. పహల్గాంలో ఉగ్ర దాడి నేపథ్యంలో ఈసారి వాటికి దూరంగా ఉన్నారు.

# నేడు పోప్ అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులు దాదాపు 164 మంది హాజరుకానున్నారు. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తదితరులు ఇందులో ఉన్నారు. చెక్కతో చేసిన శవపేటికలో ఉంచిన పోప్ పార్థివదేహాన్ని గత మూడు రోజులుగా దాదాపు 2.50 లక్షలమంది ప్రజలు సందర్శించి నివాళులు అర్పించారు. ఈ ప్రక్రియ ముగిసినట్లు అధికారులు ప్రకటించడంతో ఇంకా వేలాదిమంది నిరాశగా వెనుదిరిగారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇక్కడకు వచ్చిన రాష్ట్రపతి ముర్ము బసిలికా ఆఫ్ సెయింట్ పీటర్‌లో పోప్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ముర్ము వెంట కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జార్జ్ కురియన్, గోవా డిప్యూటీ స్పీకర్ జోషువా డిసౌజా ఉన్నారు. శనివారం వాటికన్ సిటీలో జరిగే పోప్ అంత్యక్రియల్లో పాల్గొని భారత ప్రభుత్వం, ప్రజల తరఫున రాష్ట్రపతి నివాళులు అర్పిస్తారు. దేశాధినేతలు వస్తుండటంతో ఇటలీ ప్రభుత్వం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది.

# రాష్ట్రంలో 250 మంది పాకిస్థానీయులు

హైదరాబాద్: రాష్ట్రంలో మొత్తం 250 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు పోలీసులు లెక్క తేల్చారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 208 మంది, సైబరాబాద్ పరిధిలో 39 మంది, రాచకొండ పరిధిలో ముగ్గురు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఇందులో పర్యాటక వీసాలపై వచ్చిన వారి సంఖ్య స్వల్పమే. ఎక్కువ మంది దీర్ఘకాలిక వీసాలపై ఉంటున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో మన దేశంలో ఉన్న పాకిస్థానీయుల వీసాలు రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్వయంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడారు. మినహాయింపు ఉన్న వారు, దీర్ఘకాలిక వీసాలపై వచ్చిన వారు మినహా మిగతా వారంతా గడువులోగా పాకిస్థాన్ వెళ్లిపోవాలని డీజీపీ జితేందర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. వైద్యపరమైన అవసరాల కోసం వచ్చినవారు ఈ నెల 29, మిగతా వారు ఈ నెల 27లోపు దేశం వదిలి వెళ్లిపోవాలని అందులో స్పష్టం చేశారు.

# కూటమి నేతలమంతా మనస్ఫూర్తిగా కలిసి పనిచేస్తున్నాం

కాకినాడ , పిఠాపురం: 'ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం..ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని నిరూపిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులను తట్టుకుని మరీ హామీలు నెరవేరుస్తున్నాం.. అభివృద్ధి, ప్రజాసంక్షేమంతో ముందుకెళ్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించిన ఆయన ఉప్పాడలో తితిదే కల్యాణ మండపం, గొల్లప్రోలు, చేబ్రోలులో సీతారామస్వామి ఆలయ రథశాల, ప్రాకార మండపాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు, మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. పిఠాపురంలో సామాజిక వైద్యశాలను 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ తెదేపా నేత వర్మ, భాజపా, జనసేన నేతలమంతా మనస్ఫూర్తిగా ప్రభుత్వంలో కలిసి పనిచేస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే పార్టీలతో సంబంధం లేకుండా చర్యలు ఉంటాయని చెప్పారు.

### పిఠాపురంలో గత 9 నెలల్లో..రూ.100 కోట్లతో పనులు

పిఠాపురం నియోజకవర్గంలో గత 9 నెలల్లో రూ.100 కోట్లపైగా విలువైన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేశామని పవన్‌కల్యాణ్ తెలిపారు. పిఠాపురం 30 పడకల సామాజిక ఆసుపత్రిని రూ.34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా మార్చేందుకు శంకుస్థాపన చేశామన్నారు. యు.కొత్తపల్లిలో రూ.2 కోట్లతో తితిదే కల్యాణ మండపం, గొల్లప్రోలులో 150 ఏళ్ల చరిత్ర ఉన్న సీతారామస్వామి దేవస్థానంలో మందిరం, రథశాలకు రూ.48 లక్షలు, చేబ్రోలులో రూ.1.32 కోట్లతో చేపట్టిన సీతారామస్వామి ఆలయ ప్రాకార మండప పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ వర్గాల మహిళల ఆర్థికాభివృద్ధికి ఉచిత దర్జీ శిక్షణ ప్రారంభించిందని..పిఠాపురం నియోజకవర్గంలో 3,456 మందికి రూ.8.64 కోట్ల విలువైన కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. 2వేల టార్పాలిన్లు రైతులకు ఉచితంగా ఇచ్చామన్నారు. 50 శాతం రాయితీపై 103 రొటోవేటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు అందజేశామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద నియోజకవర్గంలో రూ.18.02 కోట్ల విలువైన 31 కి.మీ. పొడవైన 276 సీసీ రోడ్లు.. రూ.3 కోట్లతో 5కి.మీ. బీటీ రోడ్లు.. రూ.8.68 కోట్లతో 431 గోకులాలు ప్రారంభించామన్నారు.

# అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం

(మొదటిపేజీ తరువాయి)

పుష్పరాజ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులతో కలసి మీడియాతో భట్టి మాట్లాడుతూ... ''ఈ సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించాం. గతంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయినప్పుడు నాటి ప్రధాని నెహ్రూ అలీన విధానంతో దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అహింస, సత్యం, సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ ద్వారా మరోసారి దిశా నిర్దేశం చేస్తోంది. శాంతి, ప్రగతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునే వారు చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు చరిత్రలో నిలిచిపోతుంది. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాన్ని మేళవించి కాంగ్రెస్ మూల సిద్ధాంతాలను ముందుకు తీసుకెళుతున్న విధానాన్ని ప్రపంచ ప్రతినిధులకు వివరించగా వారు సంతోషం వ్యక్తంచేశారు. దేశానికే ఆదర్శంగా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరాం. శాంతి, అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ సాధనకు కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చాం'' అని వివరించారు.

# గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు

*** కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సును ముస్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ముందుగా ధరణి చట్టం, భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను వివరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని, దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్‌లో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూ సమస్యలు



హద్దుల సమస్యలు రాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన చట్టంలో జియో ట్యాగింగ్‌తో అలాగే మ్యాప్‌తో పాస్ పుస్తకాలను జారీ చేయనుందని వెల్లడిరచారు. దీంతో రైతులకు దారి సమస్య ఇతర ఇబ్బందులు ఎదురుకావని స్పష్టం చేశారు. అన్ని అర్హతలు ఉండి భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి భూభారతి చట్టంతో ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. అర్హులందరూ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని హక్కులను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాధాభాయి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహశీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.

## పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా సూరారం డాక్యుమెంట్ రైటర్ల నిరసన



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దేశ భద్రతను ఛిన్నాభిన్నం చేయాలని ఉగ్రవాదులు చేపట్టిన ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని డాక్యుమెంట్ రైటర్ల సంఘం ప్రతినిధి, సామాజిక కార్యకర్త కె.రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఈ నెల 22న జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిలో 28 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయిన దారుణ సంఘటనపై శుక్రవారం కుత్బుల్లాపూర్, సూరారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే డాక్యుమెంట్ రైటర్లు నల్ల బ్యాచులు ధరించి తనదైన శైలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సంఘం ప్రతినిధి రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడి పట్ల దేశ వ్యాప్తంగా ఆవేదన వ్యక్తమవుతుందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి లో అమరులైన 28 మంది కుటుంబాల పట్ల తాము ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వ్యాఖ్యానించారు. దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, అమాయకుల ప్రాణాలు కాపాడేలా గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్యుమెంట్ రైటర్లు పాల్గొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ భావాలను వ్యక్తపరిచారు. ఇలాంటి సంఘటనలపై సమాజం మేల్కొని సంఘీభావంతో స్పందించడం అవసరమని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.

## సభకు జనం తరలింపునకు సమావేశం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ముస్తాబాద్ నుంచి భారీ ఎత్తున జనంను తరలించేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ రజోత్సవ సభకు అధిక సంఖ్యలో ముస్తాబాద్ నుంచి తరలించేందుకు నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## అందాకారంలో 14వ నెంబర్ బస్తీ..

*** వెలుగని వీధిలైట్లు.. పట్టించుకోని అధికారులు..**



ప్రజా స్ఫూర్తి,ఇల్లందు: ఇల్లందు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..14వ నెంబర్ బస్తీ అందాకారం..గత కొంతకాలంగా బస్తీలో అందాకారం నెలకొంది దీంతో స్థానికులు తీవ్ర భయాందోళన గురి అవుతున్నారు. ఇటీవల కాలంలో అకాల వర్షం, గాలి దుమారం రావడం వల్ల ఎండవేడికి తాకలేక పాములు రోడ్డు తిరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.. బస్తిలో ఉన్న నాలుగు స్తంభాలక ఉన్న వీధిలైట్లు వెలగకపోవడంతో అందాకారంలో చిన్న పిల్లలు బయటికి రావాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెలుగని వీధిలైట్లను గుర్తించి.. వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## దేశ సమగ్రత, సమైక్యతను, మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్ర

*** సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పెహల్గాంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడి భారతదేశ సమగ్రత, సమైక్యతను, మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రని, ఈ కుట్రలను సమిష్టిగా తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి అన్నారు. పెహల్గాంలో యాత్రికులపై జరుగిన టెర్రరిస్టుల దాడికి నిరసనగా, మృతులకు నివాళులర్పిస్తూ కొత్తగూడెం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే స్టేషన్ సెంటర్లో మానవాహారం నిర్మించి మృతులకు నివాళులర్పించిన అనంతరం జరిగిన




సభలో నాయకులు మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్ భారత భూభాగంలో అంతర్భాగమేనని, ఎప్పటికీ దేశం నుంచి వేరుచేయలేరన్నారు. కాశ్మీర్ సమస్యను ఆసరాగా చేసుకుని పాక్ ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడులకు తెగబడటం దుర్మార్గమన్నారు. పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమని అన్నారు. నాడు బ్రిటిష్ దొరలను దేశంనుంచి వెళ్లగొట్టేందుకు కులమతాలకతీతంగా పోరాటం చేశామని, నేడు ఉగ్రవాదులను తరిమేందుకు పోరాడదామని, దేశ సమైక్యతకు పాటుపడదామని పిలిపునిచ్చారు. ఉగ్రవాదానికి మతం రంగు పులిమి దేశాన్ని విచ్చిన్నం చేయాలనే వారి ఆకాంక్షను నెరవేర నివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ ఉమర్ ఫరూక్, అబ్దుల్ రబ్, ఎండి షరీఫ్, ఎండి అబిద్, అమీర్ ఖాద్రి, జావేద్, ఎండి అయూబ్, అన్వర్, బాబు జానీ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడిని ఖండించిన ఇల్లందు పట్టణ ముస్లిం సోదరులు

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఈ నెల 22 వ తారీఖున జమ్మూ కాశ్మీర్ బహల్గం లో జరిగినటువంటి ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరవీరులకు సంతాపాన్ని తెలియజేస్తూ కాసేపు మౌనం పాటించి అమరవీరుల మీద దాడి చేసిన ఉగ్రవాదులను వెంటనే కఠినంగా శిక్షించాలని టెర్రరిజం డౌన్ డౌన్ అంటూ హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేస్తూ ఇల్లందు పట్టణంలోని అన్ని మసీదుల నుండి ముస్లిం సోదరులందరూ కలిసి ఆమ్ బజార్లో ఉన్నటువంటి జామే మసీద్ నుండి జగదాంబ సెంటర్, పాత బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించి ఉగ్రవాద దాడిలో అమరులైనటువంటి కుటుంబాలకు సంతాపాన్ని వ్యక్తం చేసిన ఇల్లందు పట్టణ ముస్లిం సోదరులు, ఇల్లందు పట్టణ కాంగ్రెస్, బీఆర్ఎస్ సిపిఐ, సిపిఎం పార్టీల రాజకీయ



ముస్లిం నాయకులు , ఇల్లందు పట్టణ హిందూ మరియు క్రైస్తవ మత పెద్దలు కలిసి ఈ యొక్క ఉగ్రవాద దాడి చేసిన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని కోరారు. భారతదేశంలో హిందూ ముస్లిం అంటూ తేడా లేకుండా ఎన్నో దశాబ్దాల నుండి కలిసిమెలిసి ఉంటున్న క్రమంలో ఈ యొక్క దాడి చేయడము సరికాదని ఖబర్దార్ టెర్రరిస్ట్ అంటూ నినాదాలు చేసి ఎన్నటికీ ఎప్పటికీ హిందూ ముస్లింల ఐక్యతను వేరు చేయడము ఎవరి తరం కాదని ముస్లిం మత పెద్దలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో హిందూ , క్రైస్తవ మత పెద్దలు ఇల్లందు పట్టణ కాంగ్రెస్,బీఆర్ఎస్, సిపిఐ,సిపిఎం పార్టీల రాజకీయ ముస్లిం నాయకులు పట్టణ ముస్లిం యువకులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ఉగ్రవాదులు దేశపౌరులపై జరిపిన దాడి పిరికిపంద చర్య

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జమ్మూకాశ్మీర్ పెహల్గామ్ పర్యాటక ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్' నుంచి బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద ఉగ్రదాడిని కండిస్తూ మానవాహారం నిర్మించి నినాదాలు చేశారు, మృతులకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశపౌరులపై జరిపిన దాడి, హత్యాకాండ పిరికిపంద చర్యని, ఈ చర్యను భారత పౌరసమాజం సహించబోదన్నారు. ఇంటిలిజెన్స్ సంస్థ దాడుల విషయాన్ని ముందే కేంద్రానికి , ఈ దాడికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కె సారయ్య, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు ఎస్ కె ఫహీమ్, పొలమూరి శ్రీనివాస్, పట్టణ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, గౌనె మని, మాతంగి లింగయ్య, నూనావత్ గోవిందు, ఖయూమ్, జాకబ్, గుత్తుల శ్రీనివాస్, దాట్ల శ్రావణ్, రాంజీ, గౌనె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గౌడ మహా వంశ వృక్షం పుస్తకం ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : బిసి వెల్ఫేర్, రవాణా శాఖ మంత్రి సమక్షంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల మొగిలి గౌడ్ రచించిన గౌడ మహా వంశ వృక్షం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పుస్తకము రాజ్యాధికారం కోసం ఎలా పోరాటం చెయ్యాలో యువతకు, బలహీన వర్గాల వారికి చాలా ఉపయోగ పడుతుందన్నారు, వెనుకబడిన, వర్గాల వాళ్ళు తమ మూలాలను తెలుసుకొని రాజ్యాధికారం కోసం పోరాడాలని, రాజకీయంగా , విద్యాపరంగా, ఎదిగిన మహనీయుల చరిత్రలను ఆదర్శంగా మలుచుకొని, యువత తమ, భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు ఎదుగాలన్నారు. చట్టసభలలో ప్రాధాన్యత ఉన్నప్పుడే తమ జాతి ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతుందన్నారు. గౌడ వర్గ ప్రజలకు మహానుభావుల చరిత్రను పుస్తకం రూపంలో అందించిన రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల మొగిలి గౌడ్ ను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ హాస్టల్ అధ్యక్షులు చక్రవర్తి గౌడ్, ప్రొఫెసర్స్ పదాల ప్రసాద్, నరేందర్ బాబు, గౌడ కంట మ్యాగీజైన్ ఎడిటర్ సిద్దులు గౌడ్, శ్రీ నూతన గౌడ సంఘం నాయకులు మిట్టపల్లి విజయ్ గౌడ్, రవీందర్ గౌడ్, కనక రాజు, విజయరామ్, నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కెటిఆర్‌కు సభ మీదున్న శ్రద్ధ రైతులపై లేదు

*** యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఉపాధ్యక్షులు ఆరుట్ల మహేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్‌కు బిఆర్ఎస్ రజతోత్సవ సభ మీదున్న శ్రద్ధ నియోజక వర్గంలోని రైతులపై లేదని యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఉపాధ్యక్షులు ఆరుట్ల మహేష్ అన్నారు. ముస్తాబాద్ మండలంలో అకాల వర్షాలకు రైతులు వందల ఎకరాల్లో వరి, మామిడి తోటలు పోతే నియోజక వర్గానికి ఎమ్మెల్యే అయి ఉండి కూడా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. వడగండ్ల వానలకు పంటలు నష్టపోయి రైతులు కన్నీళ్లు పెడ్తుంటే పట్టించుకోరా... కనీసం పరామర్శించేందుకు కూడా వెళ్లారా అని ప్రశ్నించారు. పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించాల్సిన ఎమ్మెల్యే కెటిఆర్ రజతోత్సవ సభలంటూ సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా ఉండి ధైర్యం చెప్పాల్సిన మీరు, సభలు, సమావేశాలు అంటూ తిరుగుతారా అని ప్రశ్నించారు. ఓడినా, గెలిచిన ప్రజల మధ్యలో ఉండి వారికి అండగా ఉంటున్న వ్యక్తి కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి అని అన్నారు. అకాల వర్షాలకు నష్టమయిన పంటలను పరిశీలించి, రైతులను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అయ్యిండి నిన్ను గెలిపించిన రైతులను పరామర్శించే టైం కూడా లేకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. పంట నష్టపోయినా రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## రైతు బజార్ ను సందర్శించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖ బాబురావు

యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : శుక్రవారం బోనగిరి రైతు బజార్ ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖ బాబురావు సందర్శించి రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు, అదేవిధంగా రైతుబజార్లో మార్కెట్ కమిటీ ధరల నిర్ణయాలకు అనుగుణంగానే ప్రజలకు కూరగాయలు నిత్యావసర సరుకులను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిన్నం శ్రీనివాస్ తాడూరి నరసింహ కృష్ణ రంగా కిష్టయ్య బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం, భువనగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ గుమ్మిడేల్లి రమేష్ మాజీ కౌన్సిలర్ సలావుద్దీన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, పాశం నవీన్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ., కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# అకాల వర్షం... తడిసిన ధాన్యం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. మండలంలోని రైతులు ఆరుగాలం కష్టపడి పండిరచిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టగా, శుక్రవారం కురిసిన వర్షంతో ధాన్యం తడిసింది. అయితే గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు అకాల వర్షాల నుంచి తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి రైతులకు నష్టం జరుగుతుంది. అంతేగాకుండా కోత దశలో ఉన్న ధాన్యం, మామిడి నెల రాలడంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది.



## పాముకుంట, బసంతాపురం గ్రామాలలో జై బాపు జై భీమ్ జై సమ్మిదాన్




రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం లోని పాముకుంట, బసంతాపురం గ్రామాలలో జై బాపు జై భీమ్ జై సమ్మిదాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా పాదయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

*** మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ రేఖ బాబురావు**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వి నియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కనకుంట్ల రేఖ బాబురావ్ , తెలిపారు. శుక్రవారం భువనగిరి మండలంలో బాలంపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు దళారుల మాటలు నమ్మి ప్రైవేట్ వ్యాపారులకు వడ్లను అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిన్నం శ్రీనివాస్, తాడూరి నరసింహ, రంగా కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ భాష్యం శివానంద, ఎడ్ల శ్రీనివాస్, గుమ్మడి రమేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, బాలంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేష్, పాశం నవీన్, రామకృష్ణ, దామోదర్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు

## బస్తి లోని సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తా

*** పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రారెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బస్తి లోని సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తానని పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రారెడ్డి అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో నెలకొని ఉన్న ప్రతి సమస్యను స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు. బస్తీలోని బి.బ్లాక్ రోడ్ నెంబర్ 1 , 2 లలో భూగర్భ డ్రైనేజీ పెండింగ్ పనులు, అదే విధంగా సి.బ్లాక్ రోడ్ నెంబర్ 5 లో మంచినీటి కొరత ఏర్పడడంతో శుక్రవారం సంబంధిత అధికారులకు సమస్యను వివరించగా వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు . త్వరలోనే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను , మంచినీటి సమస్యను పరిష్కరింప చేస్తామని బస్తి వాసుల సమక్షంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి సతీష్ తో పాటుగా రవీందర్ రెడ్డి. చింటూ. బస్తీ నేతలు ఆడెపు ప్రభాకర్ ప్రకాష్ నరసింహ బాల టీవి నరసింహ, రాజేందర్, రమేష్, మనోజ్ , సుబ్బారావు , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు చట్ట సవరణ అమలు చేసి పేద ప్రజలకు న్యాయం చేయాలి




ఆలేరు, ప్రజా స్ఫూర్తి : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమలు చేసిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును అమలు చేసి పేద ప్రజలకు న్యాయం చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలేరులో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు అమలు చేయాలి రైతన్నలకు న్యాయం చేయాలని రైతన్నలతో ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ కార్యాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు వక్ఫ్ బోర్డు ముస్లిం నాయకులకే లబ్ధి చేకూరుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోది వక్ఫ్ బోర్డ్ పై విచారణ చేసి వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేసి పేద ముస్లింలకు ఉపయోగకరంగా చేశారు అన్నారు. పూర్వకాలం నుండి రైతులు సాగు చేస్తున్న భూమి వోక్స్ బోర్డ్ లో ఉండడంతో రైతన్నలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వోక్స్ బోర్డ్ ని రద్దు చేయడం లేదని కేవలం సవరణలు మాత్రమే జరిగిందని పేద ముస్లింలు గుర్తించాలని కోరారు. దేశ అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యమని తెలిపారు. అనంతరం ఆలేరు ఎమ్మార్వో అంజిరెడ్డికి వోక్స్ బోర్డ్ తో ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్,నందగంగేష్ జిల్లా కౌన్సిల్ మెంబర్లు భోగ శ్రీనివాస్ వడ్డేమాన్ నరేందర్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి శ్రీనివాస్ జిల్లా అధికార ప్రతినిధి తునీకి దశరథ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిటీకారి కృష్ణ జిల్లా నాయకులు ఐడియా శ్రీనివాస్ బీజేపీ ఎం జిల్లా అధికార ప్రతినిధి శంకర్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు అర్చన నాయకులు కళ్లెం యాదగిరి బైరి మహేందర్ గౌడ్ శేషత్వం అమరేందర్ వడ్డేపల్లి కిషన్ మైదం రాంప్రసాద్, మిట్టపల్లి భాస్కర్ నరసింహారెడ్డి కంతి రవి ముదిగొండ సత్యనారాయణ సుక్కరాజు శ్యామల శ్రీకాంత్ సారయ్య ఎలుగుల వెంకటేష్ కృష్ణమూర్తి జి పరుశురాం అజయ్ చింతకింది భాస్కర్ రైతులు ఎండి భాష దూడల లక్ష్మణ్ భూచక్రం కూరెళ్ళ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

*** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ ఇక్బాల్**



ఆలేరు, ప్రజా స్ఫూర్తి: శుక్రవారం రోజున జమ్మూ కాశ్మీర్ పహేల్గాం లో అమాయక టూరిస్టులపై టెర్రరిస్టుల దాడిని ఖండిస్తూ పట్టణంలోని బస్టాండ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ ఇక్బాల్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో జరిగిన దాడి మానవత్వం పై ఉగ్రవాదులు చేసిన దాడి అని ఉగ్రవాదానికి ఒక మతము జాతి లేవని ఉగ్రవాదం ప్రపంచంలో ఏ రూపంలో ఉన్న మానవ మనుగడకు ముప్పుగా పరిణమిస్తుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. దేశంలో శాంతిభద్రతలు కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల 23 మంది పర్యాటకులు తమ ప్రాణాలు కోల్పోయారని, గతంలో పుల్వామా ఘటన జరిగిన సందర్భంగా అనేక కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పాటిస్తున్నామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం దాడి జరిగిన తర్వాత అత్యవసర సమావేశాలు జరపడం విడ్డూరం అని వారు అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరవీరుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు ఉగ్రవాద దాడులను సాకుగా చూపి దేశంలో అలజడులు సృష్టించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని భారత దేశంలో ప్రజల మధ్య మతాల మధ్య జాతుల మధ్య వైరుధ్యాలను సృష్టించేందుకు దేశం బయట నుండి పనిచేసే అరాచక శక్తులతో పాటుగా దేశంలోపల అంతర్గతంగా కొన్ని శక్తులు దేశ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఈ తరుణంలో నిజమైన దేశభక్తులు దేశం లోని మేధావులు ప్రజాస్వామ్యవాదులు దేశాన్ని ఐక్యంగా నిలిపేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పాడి రైతుల జిల్లా నాయకులు మంగ నరసింహులు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మురిగాడి చంద్రశేఖర్, సిపిఎం మండల నాయకులు సూదగాని సత్యరాజయ్య ,ఘనగాని మల్లేశం, పిక్క గణేష్, చెక్క పరశురాములు, కాసుల నరేష్, మోరిగాడి లక్ష్మణ్, మోరిగాడి అజయ్, అబ్దుల్ మతిన్, మొరిగాడి అశోక్, బర్ల సిద్ధులు ,ఎండి అమీర్, ఘనగాని రాజు, చౌడబోయిన యాదగిరి, మాదాని నవీన్ ,ఎండి అఖిల్ తదితరులు పాల్గొన్నారు

## దోపిడీ దారులకు అడ్డాగా వక్ఫ్ బోర్డు సంస్థగా మారింది

*** మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : దేశం లో రైల్వే డిఫెన్స్ తరువాత పెద్ద సంస్థ వక్ఫ్ బోర్డు అని దోపిడీ దారులకు అడ్డాగా అసంస్థ మారిందని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు అన్నారు. శుక్రవారం చింతల్ జయాస్ బ్యాంకిట్ హాల్ లో వక్ఫ్ చట్టసవరణ అవగాహనా మేడ్చల్ జిల్లా వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమం లో ఆయనతో పాటు జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి లు ముఖ్య అతిథులు గా పాల్గొని వక్ఫ్ చట్టం సవరణ వలన పేదలకు మధ్య తరగతి ప్రజలకు జరిగే మేలును వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఆలయ ల వాళ్ళ యూనివర్సిటీ లు కాలేజ్ లు మెడికల్ కాలేజ్ లు ఇలా పేదలకు విద్య వైద్యం లాంటి సేవలు చేస్తున్నాయన్నారు. వక్ఫ్ బోర్డు ఎప్పుడైనా ముస్లిం పేదలకు ఒక్క రూపాయి సహాయం అందించిందా? కరోనా సమయం లో పెదలను ఆడుకుందా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సంస్కరణలు చేసారని తెలిపారు. ఈ కార్యక్రంలో వక్ఫ్ చట్టం సవరణ అవగాహన అభియాన్ రాష్ట్ర మెంబర్ నందనం దివాకర్, జిల్లా కన్వీనర్ విగ్నేష్, ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, పద్మయ్యా , రాష్ట్ర కార్య వర్గ సభ్యులు వాసం శెట్టి శ్రీనివాస్, బక్క శంకర్ రెడ్డి, సుధ , భారత్ సింహ రెడ్డి, ఎంఎస్.వాసు , అధ్యక్షులు కేశవ్ యాదవ్, మణికంఠ , రాజేష్ చారి, రాజు తదితరులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట మండలం నుండి సభకు భారీగా తరలిరావాలి

*** యాదగిరిగుట్ట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య**



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఈనెల 27వ తేదీన వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తి వద్ద జరిగే పార్టీ 25వ వార్షికోత్సవ సభ విజయోత్సవ సభగా మారనుందని యాదగిరిగుట్ట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ పిలుపు మేరకు జరగబోయే రజతోత్సవ సభ కు నియోజకవర్గం లోని నాయకులు,కార్యకర్తలు, భారీ ఎత్తున ఆలేరు శాసన మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి , మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ ల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పార్టీ కుటుంబ సభ్యులను కోరారు.ఈ సమావేశంలో యాదగిరిగుట్ట పట్టణ ప్రధాన కార్యదర్శి బాపట్ల నరహరి,అరే శ్రీధర్ , వాసం రమేష్, కర్రె చంద్రశేఖర్, బరిగే రాజు, ఓరుగంటి శ్రీధర్ చారి, తదితరులు పాల్గొన్నారు

## రెవెన్యూమంత్రి పేరిట వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

*** అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు**

*** మంత్రి పొంగులేటి హెచ్చరిక**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్సనల్ అసిస్టెంట్ (పిఎ) ల మని చెప్పి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి ( వయస్సు 34), మచ్చ సురేష్ ( వయస్సు 30) హైదరాబాద్ నాగోల్‌లో నివాసముంటున్నారు. వీరు మంత్రి పిఎలమంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు.ఇక నుండి తన పిఎలమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే,ఎలాంటి చిన్న అనుమానం కలిగినా సచివాలయంలోని తన కార్యాలయం 04023451072 / 04023451073 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు సూచించారు. ఎవరైనా ఈ విధంగా అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కు అవినీతి అక్రమాలపై ఫిర్యాదు



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదగిరి గుట్ట దేవస్థానంలో జరుగుతున్నటువంటి అవినీతి విషయం పైన మూడు రోజుల క్రితం దేవస్థానం ఈవోకి ఫిర్యాదు చేసినా కూడా ఎలాంటి స్పందన లేదు హయశ్రీ యాడ్స్ యజమాని పైన , దీనికి బాధ్యులు అయినటువంటి డీఈవో అక్రమాల మీద పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు దీని విషయం పైన శుక్రవారం హైదరాబాదులోని దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ , ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆఫీసులో వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, భువనగిరి రూరల్ అధ్యక్షులు చిర్క సురేష్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి మందారం మల్లేష్ గౌడ్, నరేష్ ,బోడ బుచ్చిబాబు, కర్రె శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల గొంతుకై పుట్టిన పార్టీ బిఆర్ఎస్

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ ప్రజల గొంతుకై పుట్టిన పార్టీ బిఆర్ఎస్ అని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఈనెల 27వ తేదీన వరంగల్ ఎల్కతుర్తిలో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన జరగనున్న "చలో వరంగల్" 25వ రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జిహెచ్ఎంసి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ, కొంపల్లి మున్సిపాలిటీ లకు చెందిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు హాజరవగా ఈనెల 27వ తేదీ వరంగల్లో నిర్వహించే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షతపై మన నాయకులు, పెద్దలు కేసీఆర్ గారు తెలంగాణ స్వరాష్ట్ర సాధన తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి 2001 లో టిఆర్ఎస్ పార్టీని స్థాపించారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎన్నో అవమానాలను తట్టుకుంటూ తెలంగాణ వానిని వినిపిస్తూ తెలంగాణ ప్రజల గొంతుకై పాలకులతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానేత కెసిఆర్ అని అన్నారు. స్వరాష్ట్రాన్ని సాధించిన 10 ఏళ్లలోనే అభివృద్ధి, సంక్షేమాలతో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా అభివృద్ధి చేసి సస్యశ్యామలం చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గారికే దక్కుతుందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేలా అందరం సమన్వయం చేసుకుంటూ బయలుదేరి వెళ్లి చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ డిప్యూటీ మేయర్, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ని కలిసిన పల్లె సంతోష్ గౌడ్



రాజాపేట్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని శుక్రవారం వారి నివాసంలో రాజాపేట టిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రభుత్వంతో సింగరేని కాలరీస్ అధికారుల అవగాహన ఒప్పందం

*** కలెక్టర్ ను కలిసిన సింగరేణి అధికారులు..**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మణుగూరు సింగరేణి అధికారులు శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ని ఐడిఓసీలో కలిశారు.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కట్టు వాగు, మెట్ల వాగు, పూడిక తీత పనులు ,మణుగూరు మున్సిపాలిటీ అంతా కూడా వరద ప్రభావిత ప్రాంతానికి గురి కాకుండా కట్టుదిట్టమైనటువంటి ఏర్పాట్లు చేయడానికి కలెక్టర్ ని కలిసి ప్రభుత్వంతో 83.25.లక్షలు కు గాను ఎం ఓ యు చేసుకున్నారు.సింగరేణి కాలరీస్ వలన సంస్థ చుట్టుపక్కలలో ఉన్న గ్రామాలలో అందరికీ కూడా విద్య, వైద్య సహాయం ఉద్యోగ సౌకర్యాలు కల్పిస్తూ చెరువులు, కుంటలు, వ్యవసాయం మౌలిక వసతులు తదితర అనేక ఇటువంటి సదుపాయాలు ప్రజలకు కల్పిస్తున్నందుకు సింగరేణి అధికారులను కలెక్టర్ అభినందించారు.

## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల వేడుకలను విజయవంతం చేయాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఛలో వరంగల్" బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల వేడుకలను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం జగద్గిరి గుట్ట డివిజన్ మగ్దూం నగర్ లోని సాయిబాబా కళ్యాణ మండపంలో నిర్వహించిన "ఛలో వరంగల్" బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల వేడుకల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పహల్గావ్ ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే విధంగా అన్ని మతాల వారు సంతోషంగా జీవిస్తున్న భారతదేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా ఉగ్రదాడికి పాల్పడిన వారు, వారి వెనుక ఉన్నది ఎంతటి వారైనా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు పాపులు గౌడ్, శశిధర్, అజం, శశిధర్ ముదిరాజ్, ముంతాజ్, రామరాజు,మహేందర్ రెడ్డి, జైహింద్, నర్సింగ్ గౌడ్, రాములు, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఇల్లందు పోలీస్ స్టేషన్ ను శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ కు వచ్చిన భాదితుల సమస్యలను తెలుసుకుని తక్షణమే విచారణ చేపట్టి న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్లో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించే వ్యక్తులను గుర్తించి అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను,సిఐ సత్యనారాయణ,ఎస్సై శ్రీనివాసరెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి సానుభూతి చూపడం సరిపోదు

*** వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావు**




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పహల్గామ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారికి కేవలం సానుభూతి చూపడం సరిపోదనీ మనం జవాబు దారులుగా మారాలనీ వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావు అన్నారు. కాశ్మీర్ లోని పహల్గము లో పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ వినాయక పార్క్ వివేకానంద నగర్ కాలనీ నుండి వివేకానంద విగ్రహం వివేకానంద నగర్ కాలనీ మెయిన్ రోడ్డు వరకు స్థానిక నాయకులు ప్రజలతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజా దేవి మాట్లాడుతూ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అది కేవలం ఉత్తర భారతంలో జరిగిన సంఘటన కాదని అది ప్రతి భారతీయుడి గుండెను చీల్చిన దారుణమన్నారు. దేశంలో మతపరమైన శాంతిని, మానవతా విలువలను తుడిచిపెట్టాలని కోరే ఈ ఉగ్రశక్తులు, అమాయక ప్రజలె లక్ష్యంగా దాడి చేసి అల్లరిలు సృష్టించె కుట్రతో పనిచేస్తున్నాయన్నారు. ఉగ్రవాదానికి మన సమాధానం ఐక్యతనీ మతభేదాలు లేకుండా మనం ఒక భారతీయులమని నిలబడ్డప్పుడు, దేశ శత్రువులకు మన బలం అర్థం అవుతుందన్నారు. కొవ్వొత్తులు కేవలం వెలుగులు కాదు అవి భయాన్ని దహించే అగ్ని కావాలనీ అన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మన ఘన నివాళులు అర్పిస్తూ వారి త్యాగాన్నిగుర్తు పెట్టుకుంటూ, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలనే సంకల్పంతో మనం ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, రౌతు మోహన్ రావు, బి. కరుణాకర్ రావు, కె.వి. రావు, శ్రీధర్ రావు, వి. వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, మాధవరం రఘు, పల్లపు బాబు, కొండల్ రావు, తీగల కృష్ణారావు, అనిల్ కుమార్, మల్లేష్, నవీన్ చారి, జి అనిల్ కుమార్, విద్యాసాగర్, యశ్వంత్, మాధవి రెడ్డి, రాధా, లక్ష్మీకాంతమ్మ, శైలజ, అవనిక, తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమస్ఫూర్తిని రగిలించిన జెండా బీఆర్ఎస్

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రజాసంక్షేమాన్ని విస్మరించే ప్రభుత్వాలను నిగ్గదీస్తూ తెలంగాణ ప్రజలకు సంక్షేమాన్ని అందించే విధంగా పాలకుల మెడలు వంచేది బీఆర్ఎస్ జెండా అని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఛలో వరంగల్" బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ముస్తాబైంది. ఈ వేడుకల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూం నగర్లో పార్టీ జెండా దిమ్మెకు ఎమ్మెల్యే గులాబీ రంగును వేస్తూ నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమస్ఫూర్తిని రగిలించిన జెండా.... తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన జెండా... అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా తెలంగాణ అభివృద్ధిని గత పదేళ్ల కాలంలో ఉరుకులు పెట్టించిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఎల్లవేళలా రక్ష ఈ జెండా ఇంతటి ఘనచరిత్ర కలిగిన ఈ జెండా, మన జెండాను గులాబీ జెండా రజతోత్సవ వేడుక పండుగకు జగద్గిరిగుట్ట డివిజన్ నుంచి భారీగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి ఛలో వరంగల్ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు పాపులు గౌడ్, శశిధర్, అజం, శశిధర్ ముదిరాజ్, ముంతాజ్, రామరాజు,మహేందర్ రెడ్డి, జైహింద్, నర్సింగ్ గౌడ్, రాములు, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర దాడిలో మృతి చెందిన బాధితుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

*** బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు**



శేరిలింగంపల్లి,( ప్రజాస్ఫూర్తి ) : జమ్ము కాశ్మీర్ పహల్గం ఉగ్ర దాడిలో మరణించిన బాధితుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుని అండగా నిలవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆల్విన్ కాలనీ డివిజన్ లోని మహంకాళి నగర్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సతీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ రావు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్లో భాగంలో ఈ సామూహిక హంతకులు తమ మానవత్వం లేని చర్యలకు వారి ప్రాణాలతోనే మూల్యం చెల్లించాలన్నారు. మన దేశంలో ఉగ్రవాదానికి స్థానం లేదు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా నిలబడదమన్నారు. ఇంతటి క్రూరమైన చర్యలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులకు మతం మానవత్వం ఉండదు

*** సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కాశ్మీర్ రాష్ట్రం పహల్గాం లో పర్యటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడులను ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి కులం మతం ప్రాంతం మానవత్వం ఉండదని చంపడమే వారి లక్ష్యమని ఇది దుర్మార్గపు చర్య అని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలని దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదం అది ఎలాంటిదైనా నరనరానా వ్యతిరేకించాలని అలా వ్యతిరేకించడమే భారత దేశ పౌరులుగా మన కర్తవ్యం అని దేశా ఐక్యతను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ ఉద్యమంలో పరాయి పాలనకు వ్యతిరేకంగా హిందూ ముస్లిం భాయి భాయి అంటూ ఎలా పోరాటం చేసామో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కూడా దేశ ప్రజలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కే సమ్మయ్య ,నాయకులు నందిపాటి రమేష్ ,విజయగిరి శ్రీనివాస్ ,విజయ్, సతీష్ ,సరోజ తదితరులు పాల్గొన్నారు.

*** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మైనారిటీ జేఏసీ తలపెట్టిన పోరాటానికి సిపిఎం మద్దతు**

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్థానిక సూపర్ బజార్ సెంటర్లో కాంగ్రెస్ మరియు మైనార్టీ జేఏసీ సంస్థలు చేపట్టిన నిరసన దీక్షకు మానవహారానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మైనారిటీ సంస్థలు హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ చేపట్టిన కార్యక్రమం దేశభక్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు

# వేసవికి... రంగుల డిజైన్లు!

దుస్తులకు రంగులు అద్దే సంప్రదాయ పద్ధతుల్లో టై అండ్ డై ఒకటి. ఆధునిక ఫ్యాషన్లు ఎంతగా అలరిస్తున్నా... దీనికి మాత్రం ఆదరణ తగ్గడంలేదు. ఈ విధానంలో వస్త్రానికి దారం కట్టి రంగుల్లో ముంచి తీస్తారు. ఆరాక వాటిని విప్పేస్తారు. త్రెడ్ ముడివేసిన తీరుని బట్టి చుక్కలు, గీతలతో కలర్‌ఫుల్ ఫ్యాబ్రిక్ సిద్ధమైపోతుంది. ఓంబ్రే, బాతిక్, షిబోరీ... వంటివన్నీ ఇందులోనివే. ఇలా రూపొందించిన వస్త్రంతో చీరలు, దుపట్టాలు, కుర్తీలు... ఇలా ఎన్నో రకాల దుస్తులు తయారవుతాయి. ఈ వేసవికి ఇదే ఫ్యాషన్... మనసుకు నచ్చింది మీరూ ఎంచుకోండి. పైగా ఇవి ఏక రంగులోనే కాదు... డబుల్, మల్టీ కలర్స్‌లోనూ కనువిందు చేస్తాయి. నిజానికి టై అండ్ డై టెక్నిక్‌ది వేల ఏళ్ల చరిత్ర. వివిధ సంస్కృతుల్లో విభిన్నమైన పేర్లతో పాపులర్ అయ్యింది. మన దేశంలో బంధేజ్, బంధానీ, బాందినీ అనే పేర్లతో వాడుకలో ఉంది. ఎలా పిలిచినా.. కట్టుకున్న వారికి కొత్తదనం, చూసేవారి కళ్లకు ఆహ్లాదం,ఆనందం కలిగించే ఈ ఫ్యాషన్‌ని ఈతరం అమ్మాయిలు తెగ ఇష్టపడుతున్నారు. ధరించి మురిసిపోతున్నారు. బాగున్నాయి కదూ!



# వంటింట్లోనూ చల్లచల్లగా!

**ఉదయం, రాత్రి వంటింట్లో పని చేస్తుంటాం. వేసవి ప్రతాపానికి పొయ్యి వేడి తోడై ఉక్కబోతతో తీవ్రంగా ఇబ్బంది పడుతుంటాం. చెమటతో ఉక్కిరిబిక్కిరి అవుతాం. పోనీ ఫ్యాన్ వేద్దామంటే పొయ్యి ఆరుతుంది లేదా మంట సరిగ్గా తగలక వంట త్వరగా అవదు. ఇలాకాకుండా... చెమట పట్టకుండా ఆహ్లాదంగా ఫీల్ అవుతూ వంట చేయాలంటే వంటింట్లో ఇవి ఉండాల్సిందే.**



### కూలింగ్ ఫ్యాన్...

ఈ డ్యూయెట్ ఐ కిచెన్ కూలింగ్ ఫ్యాన్‌ను టచ్‌స్క్రీన్‌తో ఆపరేట్ చేయొచ్చు. ఎక్కడికైనా తేలికగా తీసుకెళ్లొచ్చు. దృఢమైన బేస్‌తో చిన్న గదుల్నీ క్షణాల్లో చల్లగా మార్చగలదు. తక్కువ శబ్దంతో వంట చేసేటప్పుడు అంతరాయంగానూ అనిపించదు. ఇందులో నీటి పరిమాణాన్ని చూపించే సూచిక ఉండటంతో సులభంగా పరిశీలించొచ్చు. కావాల్సినప్పుడు నీటిని నింపితే సరిపోతుంది. వంట వేగంగా పూర్తిచేయొచ్చు. అలసటా ఉండదు. ఇంకెందుకాలస్యం.వేసవిలోనూ వంటింట్లో ఉత్సాహంగా పని పూర్తిచేయడానికి వీటిలో దేనిని ఎంచుకుంటున్నారు మరి!

### పోర్టబుల్ కూలర్స్ ...

కరెంటుతో పనిచేసే వీటిని పొయ్యి గట్టుపై పక్కగా ఉంచితే చాలు. మన చుట్టూ వాతావరణం చల్లగా మారిపోతుంది. పరిమాణంలోనూ చిన్నగా ఉండటంతో ఎక్కువ చోటు కూడా వీటికి అవసరం ఉండదు. ఓవైపు చల్లదనాన్ని ఆస్వాదిస్తూ మరోవైపు ఉత్సాహంగా వంటపని











## ఇకపై అమెరికా మార్కెట్‌లో విక్రయించే ఐఫోన్‌ల తయారీ భారత్‌లోనే..!



**న్యూఢిల్లీ:** అమెరికా, చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం మరింత ముదురుతోంది. ఈ నేపథ్యంలో ఈ టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీకి సంబంధించిన పూర్తి అసెంబ్లీని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తోంది. వచ్చే ఏడాది సాధ్యమైనంత తొందరగానే అమెరికా ఫోన్‌లకు సంబంధించిన యాపిల్ ఐఫోన్ అసెంబ్లీ భారత్‌కు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పలు ఆంగ్ల మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి.

2026 నాటికి అమెరికా మార్కెట్ కోసం తయారు చేసే ఐఫోన్ల తయారీ ప్రక్రియ మొత్తం భారత్ కేంద్రంగానే జరిగేలా యాపిల్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మీడియా రిపోర్ట్స్ చెబుతున్నాయి. ఇప్పటివరకు అమెరికా వెలుపల తయారు చేస్తున్న ఐఫోన్లలో భారత్ వాటా 14 శాతం కాగా, దాదాపు 80 శాతం ఐఫోన్‌లు చైనాలోనే తయారవుతున్నాయి. ఇప్పుడు సుంకాల నేపథ్యంలో యాపిల్‌పై అదనపు భారం పడనుంది. చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకుంటే 145% పన్ను కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ఫలితంగా చైనా, భారత్‌లలో తయారయ్యే ఐఫోన్ల ధరల మధ్య అమెరికా మార్కెట్‌లో భారీ వ్యత్యాసం ఉండనుంది. చైనాతో పోలిస్తే భారత్‌లో తయారయ్యే ఐఫోన్‌ల ధరలు తక్కువగా ఉండనున్నాయి. ఈ క్రమంలోనే ఐఫోన్‌ల తయారీని భారత్‌కు మార్చాలని యాపిల్ కంపెనీ యోచిస్తోంది. అదే జరిగితే అమెరికా మార్కెట్‌లో ఇక నుంచి 'మేక్ ఇన్ ఇండియా' ఐఫోన్లే కనిపించనున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తొలిసారి ఎన్నికైనప్పుడే చైనాతో వాణిజ్య విరోధం మొదలైంది.

దాంతో చైనా కాకుండా బలమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మరో దేశాన్ని ఎంచుకోవాలని యాపిల్ సహా పలు బహుళజాతి సంస్థలు భావించాయి. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్లపై తయారీ ఆధారిత ప్రోత్సాహకాలు కల్పిస్తామని 2020లో భారత ప్రభుత్వం ప్రకటించింది. దాంతో యాపిల్ కంపెనీ మన దేశంలో ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించింది. గత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ కంపెనీ 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్‌లో తయారు చేసింది.

## నెట్‌ఫ్లిక్స్ సేవల్లో అంతరాయం..

### సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతున్న సబ్‌స్క్రైబర్లు

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్‌ఫ్లిక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం నుంచి నెట్‌ఫ్లిక్స్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సబ్‌స్క్రైబర్లు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా లాగిన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని గంటలుగా ఈ సమస్య కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సమస్యపై సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు.

అమెరికాలోని న్యూయార్క్, చికాగో, డల్లాస్, లాస్ ఏంజెల్స్ నగరాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అక్కడి యూజర్లు సమస్యపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. లాగిన్ చేస్తుంటే.. ఎర్రర్ మెసేజ్ వస్తోందని, ఖాతాలను ఓపెన్ చేయలేకపోతున్నామని తమ పోస్టుల్లో పేర్కొంటున్నారు. 'సమ్ థింగ్ వెంట్ రాంగ్.. కొంత సమయం తర్వాత మళ్లీ ప్రయత్నించండి' అనే సందేశం స్క్రీన్‌పై దర్శనమిస్తున్నట్లు యూజర్లు పేర్కొంటున్నారు. ఈ మేరకు సమస్యలకు సంబంధించిన స్క్రీన్ షాట్స్‌ను కూడా తమ పోస్టులకు జత చేస్తున్నారు.

## మార్కెట్లపై ఉగ్రదాడి ఎఫెక్ట్..

### నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

### మార్కెట్లపై ఉగ్రదాడి ఎఫెక్ట్

### 588 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

### 207 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాల్లో ముగిశాయి. పహల్గామ్ ఉగ్రదాడి మన మార్కెట్లపై ప్రభావాన్ని చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 588 పాయింట్లు కోల్పోయి 79,212 పడిపోయింది. నిఫ్టీ 207 పాయింట్లు దిగజారి 24,039 వద్ద స్థిరపడింది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి రూ. 85.44గా కొనసాగుతోంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

టీసీఎస్ (1.36), టెక్ మహీంద్రా (1.06), ఇన్ఫోసిస్ (0.60), అల్ట్రాటెక్ సిమెంట్ (0.46), ఇండస్ ఇండ్ బ్యాంక్ (0.32).

**టాప్ లూజర్స్:**

అదానీ పోర్ట్స్ (3.61), యాక్సిస్ బ్యాంక్ (3.48), ఎటర్నల్ (3.41), బజాజ్ ఫిన్ సర్వ్ (2.85), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (2.56).

# ఇషాన్, మెండిస్ మెరుపులు..

### చెపాక్‌లో చెన్నైకి షాకిచ్చిన సన్‌రైజర్స్

**చెన్నై:** ఐపీఎల్ రికార్డు బ్రేకర్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక పోరులో గర్జించింది. 18వ సీజన్ ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంటూ అద్భుత విజయం సాధించింది. చెపాక్ స్టేడియంలో టాపార్డర్ విఫలమైనా ఇషాన్ కిషన్(44) చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను ఉతికేశాడు. అనికేత్ వర్మ(19) రాణించినా.. నూర్ అహ్మద్() తిప్పేయగా సగం వికెట్లు పడ్డాయి. అయినా సరే ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వని కమిందు మెండిస్(30 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి(19 నాటౌట్)లు ధనాధన్ ఆడి హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చారు. ఆడిన 9 మ్యాచుల్లో ఏడింటా ఓడిన సీఎస్కే అనధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినట్టే.

ఐపీఎల్ 18వ సీజన్‌లో వరుస ఓటములతో 9వ స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ చావోరేవో పోరులో చెలరేగింది. పేసర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చెపాక్ స్టేడియంలో సూపర్ కింగ్స్‌ను భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేసింది. ఆపై స్వల్ప ఛేదనను 19 ఓవర్లో 5 వికెట్ల నష్టానికి ఛేదించింది. సన్‌రైజర్స్‌కు సీఎస్కే పేసర్ ఖలీల్ అహ్మద్ పెద్ద షాకిచ్చాడు. రెండో బంతికే ఓపెనర్ అభిషేక్ శర్మ(0)ను ఔట్ చేశాడు. అభి ఆడిన బంతిని అన్షుల్ కంబోజ్ సులువుగా అందుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ జతగా హెడ్ ధాటిగా ఆడాడు. ఇద్దరూ బౌండరీలతో చెలరేగారు. అయితే.. పవర్ ప్లే ముగుస్తుందనగా హెడ్‌ను బౌల్డ్ చేసి బ్రేకిచ్చాడు.








ఆ తర్వాత వచ్చిన హెన్రిచ్ క్లాసెన్(7) క్రీజులో కుదురుకునేలోపే జడేజా బౌలింగ్‌లో హుడా చేతికి దొరికాడు. అంతే.. 3 వికెట్లు పడ్డాయి. అనికేత్ వర్మ(19).. సామ్ కరణ్ వేసిన 10 ఓవర్లో ఇషాన్ ఫోర్, అనికేత్ సిక్సర్ బాదడంతో స్కోర్ 60 దాటింది. నాలుగో వికెట్‌కు 36 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని నూర్ అహ్మద్ విడదీశాడు. ఇషాన్ ఆడిన బంతిని సామ్ కరన్ అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడు. ఆ కాసేపటికే అనికేత్‌ను నూర్ ఔట్ చేయగా 13.5 ఓవర్లకు సన్‌రైజర్స్ సగం వికెట్లు కోల్పోయింది. అప్పటికీ విజయానికి 37 బంతుల్లో 49 రన్స్ అవసరం.

**కమిందు, నితీశ్ జోరు..**

ఐదు వికెట్లు పడినా కమిందు మెండిస్(30 నాటౌట్) ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. నూర్ అహ్మద్ వేసిన 16వ ఓవర్లో స్వీప్ షాట్లతో రెండు ఫోర్లు రాబట్టాడు. రెండు నో బాల్స్ కూడా తోడవ్వగా 13 రన్స్ వచ్చాయి. నితీశ్ కుమార్ రెడ్డి(19 నాటౌట్) పథిరన బౌలింగ్‌లో రెండు ఫోర్ బాది జట్టు స్కోర్ 140 దాటించాడు. దాంతో, హైదరాబాద్ విజయానికి చేరువైంది. జడేజా వేసిన 18వ ఓవర్లో మెండిస్ మూడు డబుల్స్ తీసి జట్టుకు 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

**బ్రెవిస్ ఒక్కడే..**

ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక పోరులో పంజా విసిరింది. టాస్ గెలిచి చెన్నై సూపర్ కింగ్స్‌ను బ్యాటింగ్ ఆహ్వానించిన కమిన్స్ సేన పవర్ ప్లేలోనే ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. 47 వద్ద మూడో వికెట్ పడిన సీఎస్కేను తొలి మ్యాచ్ ఆడుతున్న డెవాల్డ్ బ్రెవిస్(42), రవీంద్ర జడేజా(21), శివం దూబే(12)లు ఆదుకున్నారు.

ధాటిగా ఆడుతున్న జడ్డూను కమిందు మెండిస్ బౌల్డ్ చేయడంతో సీఎస్కే కోలుకోలేకపోయింది. హర్షల్ పటేల్(4-28) సీఎస్కే మిడిలార్డర్‌ను క్రీజులో నిలువనీయలేదు. బ్రెవిస్ మెరుపులకు ముగింపు పలికిన అతడు.. ధోనీ(6), నూర్ అహ్మద్(2)లను ఔట్ చేసి చెన్నైని ఆలౌట్ అంచున నిలిపాడు. డెత్ ఓవర్లలో దీపక్ హుడా(22) ధనాధన్ ఆడి జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. అతడు 20వ ఓవర్ ఐదో బంతికి ఔటవ్వడంతో సీఎస్కే 154 రన్స్‌కు ఆలౌటయ్యింది.

## పరాయి గడ్డపై టీ20 లీగ్

### చరిత్ర సృష్టించనున్న న్యూజిలాండ్




**న్యూజిలాండ్:** టీ20లకు ఆదరణ పెరగడంతో ఫ్రాంచైజ్ క్రికెట్ జోరందుకుంది. ఐపీఎల్ తరహాలో పలు దేశాల్లో పొట్టి క్రికెట్ లీగ్స్ జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజ్ క్రికెట్ క్రేజ్ గుర్తించిన న్యూజిలాండ్ క్రికెట్ త్వరలోనే కొత్త లీగ్‌కు శ్రీకారం చుట్టనుంది. పరాయి గడ్డపై ఒక టీ20 లీగ్‌ను నిర్వహించనుంది. తద్వారా విదేశంలో ఫ్రాంచైజ్ క్రికెట్ జరపనున్న ఐసీసీ పూర్తి సభ్యత్వం కలిగిన తొలి దేశంగా న్యూజిలాండ్ రికార్డు సృష్టించనుంది. అమెరికాకు చెందిన ట్రూ నార్త్ స్పోర్ట్స్ వెంచర్స్‌తో కలిసి కొత్త మేజర్ క్రికెట్ లీగ్ ప్రారంభానికి కివీస్ సన్నాహకాలు చేస్తోంది.

'ట్రూ నార్త్ స్పోర్ట్స్ వెంచర్‌తో ఒప్పందం కుదరడం న్యూజిలాండ్ క్రికెట్‌లో ఒక మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజ్ క్రికెట్ ఊపందుకుంటుంది. మా క్రికెట్ నెట్‌వర్క్‌తో కలసి.. టీ20ల్లో కొత్త అధ్యాయం లిఖించాలని అనుకుంటున్నాం. దాంతో, మాకు ఆదాయ వనరులు పెరగడమే కాకుండా.. అంతర్జాతీయంగా మా బోర్డుకు మరింత పేరు రానుంది. అంతేకాదు.. అభిమానగణమూ పెరగనుంది. ఆ దేశంలోని క్రికెటర్లకు, కోచ్‌లకు ఈ లీగ్ ఉపయోగపడనుంది' అని న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ స్కాట్ వీనింక్ ఓ ప్రకటనలో వెల్లడించాడు.

2027లో తొలి సీజన్ విదేశంలో ఫ్రాంచైజ్ క్రికెట్ లీగ్ ఆలోచనతో ముందుకువెళ్తున్న న్యూజిలాండ్ క్రికెట్ పెట్టుబడుల ఆకర్షించేందుకు పావులు కదుపుతోంది. అయితే.. టీఎన్ఎస్ నుంచి న్యూజిలాండ్ క్రికెట్‌కు డబ్బులు సమకూరే అవకాశం ఉంది. 2027లో ఎంసీఎల్ తొలి సీజన్ జరుగనుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఇప్పటివరకూ ఐసీసీ సభ్యదేశాలైన భారత్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికాలు సొంతగడ్డపై ఫ్రాంచైజ్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాయి. ఇండియాలో ఐపీఎల్, పాక్‌లో పాకిస్థాన్ సూపర్ లీగ్, సఫారీల నేలపై ఎస్ఏ టీ20%ా%పాపులర్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే న్యూజిలాండ్ కూడా ఫ్రాంచైజ్ క్రికెట్ లీగ్ తీసుకురావాలని భావిస్తోంది.

## పంజాబ్ కింగ్స్ నెట్స్‌లో యువ స్పిన్నర్..





### కోల్‌కతాకు చెక్ పెట్టేందుకేనా..?

**కోల్‌కతా:** ఐపీఎల్ 18వ సీజన్‌ను భారీ విజయంతో మొదలు పెట్టి పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడింది. ఐదో స్థానంలో ఉన్న శ్రేయాస్ అయ్యర్ సేన శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది. కీలకమైన ఈ మ్యాచ్ కోసం పంజాబ్ తనుష్ కొతియాన్‌ను నెట్ బౌలర్‌గా తీసుకుంది. రంజీ ట్రోఫీలో ముంబైకి ఆడే ఈ స్పిన్నర్ అండగా.. మాజీ ఛాంపియన్‌ను దెబ్బకొట్టాలనే వ్యూహంతో ఉంది అయ్యర్ బృందం. కోల్‌కతాకు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ రూపంలో మిస్టరీ స్పిన్నర్లు ఉన్నారు. వీళ్లను ఎదుర్కోవడం కష్టమే కాదు కొన్నిసార్లు అసాధ్యం కూడా. అందుకే.. స్పిన్‌లో వైవిధ్యం చూపగల 26 ఏళ్ల తనుష్ సేవల్ని అందిపుచ్చుకోవాలనుకుంది పంజాబ్. ఆఫ్ స్పిన్నర్ అయిన తనుష్.. కోల్‌కతా స్పిన్ ద్వయాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో పంజాబ్‌కు ఉపయోగపడున్నాడు. స్పిన్ బౌలింగ్ కోచ్ సునీల్ జోషితో సుదీర్ఘ సమయం మాట్లాడిన తనుష్.. ఆ కాసేపటికే నెట్స్‌లో పంజాబ్ బ్యాటర్లకు బౌలింగ్ చేస్తూ కనిపించాడు.

**ఒకే ఒక మ్యాచ్**

దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న తనుష్.. ఆల్‌రౌండర్ కూడా. అచ్చం భారత మాజీ స్పిన్నర్ అశ్విన్ మాదిరిగా ఉంటుంది తనుష్ బౌలింగ్ యాక్షన్. అందుకే.. అతడిని ఎదర్కోవడం కష్టంగా ఉంటుంది. దాంతో, 17వ సీజన్‌లో ఈ యువకెరటాన్ని రాజస్థాన్ రాయల్స్ దక్కించుకుంది. కానీ, ఒకే ఒక మ్యాచ్‌కు పరిమితం చేసింది. ఇక 18వ ఎడిషన్ ముందు జరిగిన మెగా వేలంలో రూ.30 లక్షలకు తనుష్ పాల్గొన్నాడు. కానీ, అతడిని ఏ ఫ్రాంచైజీ కొనలేదు. దాంతో, దేశవాళీపై గురి పెట్టిన తనుష్.. ముంబై జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు.

## ఐపీఎల్‌లో ధోనీ అరుదైన ఫీట్..

### నాలుగో క్రికెటర్‌గా రికార్డు




**చెన్నై:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 43 ఏళ్ల వయసులో మరో రికార్డు నెలకొల్పాడు. ఐపీఎల్‌లో విజయవంతమైమన సారథుల్లో ఒకడైన ధోనీ.. ఈ మెగా లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన నాలుగో భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఆరంభ సీజన్ నుంచి ఆడుతున్న మహీ.. శుక్రవారం 400వ మ్యాచ్ ఆడుతున్నాడు. చెపాక్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై బరిలోకి దిగడం ద్వారా తాలా ఈ ఫీట్ సాధించాడు. ఐపీఎల్‌లో ఈ మైలురాయికి చేరువైన ధోనీ.. రోహిత్ శర్మ, దినేశ్ కార్తిక్, విరాట్ కోహ్లీల సరసన చేరాడు.

ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్ల జాబితాలో రోహిత్ అగ్రస్థానంలో ఉన్నాడు. ముంబైని ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిపిన హిట్‌మ్యాన్ ఇప్పటివరకూ 456 మ్యాచులు ఆడాడు. రాయల్ ఛాలెంజర్స్ మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

ప్రస్తుతం ఆర్సీబీ మెంటర్‌గా సేవలిందుస్తున్న కార్తిక్ ఐపీఎల్‌లో 412 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మెగా లీగ్ ఆరంభ సీజన్ నుంచి బెంగళూరుకు మాత్రమే ఆడుతున్న విరాట్ కోహ్లీ మూడో ప్లేస్‌లో నిలిచాడు. 18 ఎడిషన్లలో ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహిస్తున్న విరాట్ 408 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు.

గైక్వాడ్ గాయంతో మళ్లీ కెప్టెన్‌గా..

టీమిండియాకు మూడు ఐసీసీ ట్రోఫీలు అందిచిన ధోనీ.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు టైటిళ్లు కట్టబెట్టాడు. తాలా సారథ్యంలో తిరుగులేని శక్తిగా అవతరించిన చెన్నై.. 2010, 2011, 2018, 2021, 2023లో ట్రోఫీని ముద్దాడి ముంబై ఇండియన్స్ రికార్డును సమం చేసింది.

అయితే.. వయసు 40 దాటడంతో 17వ సీజన్ ముందు కెప్టెన్సీని వదులుకున్న మహీ తన వారసుడిగా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంచుకున్నాడు. అయితే.. 18వ ఎడిషన్ రెండో వారంలో గైక్వాడ్ మోచేతి గాయంతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. దాంతో, అనుభవజ్ఞుడైన మహీకే మళ్లీ పగ్గాలు అప్పగించింది సీఎస్కే యాజమాన్యం. ఫినిషర్‌గా పేరొందిన ధోనీ ఇప్పటివరకూ ఐపీఎల్‌లో 137.54 స్ట్రయిక్ రేటుతో 5,243 పరుగులు సాధించాడు. అందులో 24 అర్ధ శతకాలు ఉన్నాయి.



టాకీస్: కీర్తి సురేష్..పేరు చెబితే మహానటి సినిమానే గుర్తుకు వస్తుంది. మూవీలో సావిత్రిగా నటించి అందరి మన్ననలు అందుకుంది. ఇక కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. అప్పట్లో కీర్తి సురేష్‌ని వరుస హిట్స్ పలకరించిన ఇప్పుడు మాత్రం హిట్ దొరకడం కష్టంగా మారింది. గత కొంత కాలంగా టాలీవుడ్‌లో కూడా అవకాశాలు దక్కించుకోలేకపోతుంది. టాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటు-న్న ఈ ముద్దుగుమ్మ.. కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం పలు సినిమాలో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది. మొదట్లో పద్దతిగా ఉన్న కీర్తి సురేష్ ఇటీవల గ్లామర్ డోస్ కూడా పెంచింది. పెళ్లయిన తర్వాత అమ్మడు గ్లామర్ షోలకు దూరంగా ఉంటుందని అంతా అనుకున్నారు దీనికి భిన్నంగా ముందుకంటే మరింతగా గ్లామర్ షోలు చేస్తూ రెచ్చిపోతుంది. గత సంవత్సరం అట్లీ- నిర్మాణంలో విడుదలైన బేబీ జాన్ చిత్రం ద్వారా హిందీలోకి అడుగుపెట్టింది కీర్తి సురేష్. ఆ చిత్రంతో కీర్తి బాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంది. కాని మూవీ పరాజయం చెందడంతో తిరిగి దక్షిణాది సినిమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుందిట. రీసెంట్ గా కీర్తి సురేష్ మరో జాక్‌పాట్ కొట్టినట్టు తెలుస్తోంది సార్, లక్కీ బాస్కర్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించనున్నారట. సూర్యా 46వ సినిమాగా ఈ చిత్రం రూపొందుతుండగా, ప్రస్తుతం ఈసినిమాకు సబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. 7 ఏళ్ల క్రితం సూర్య, కీర్తి సురేష్ కాంబినేషన్ లో గతంలో ఒక సినిమా వచ్చింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన ఓ సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. కాని ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా వచ్చిన దాదాపు 7 సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ సూర్యతో కలిసి నటిస్తుంది. మరి ఈ చిత్రంతో అయిన అమ్మడి ఫేట్ మారుతుందా చూడాలి.



# హిట్-3 పెద్దలకు మాత్రమే

**టాకీస్:** నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సినిమా హిట్ 3. విడుదలకు సిద్దంగా ఉంది. యంగ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నానిని ఇప్పటి వరకు చూడని కొత్త యాంగిల్‌లో చూడబోతున్నాం. ఆ మధ్య రిలీజ్ అయిన టీజర్ తో ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్ చుస్తే ఈసారి వైలెన్స్‌కే వణుకు పుట్టించేలా ఉన్నాడు నాని. దసరా, సరిపోదా శనివారం లాంటి మాస్ సినిమాలు చేసినప్పటికీ హిట్ 3తో ఊహించని ఊచకోతకు రెడీ అవుతున్నాడు నాని. కాగా హిట్ 3 వరల్డ్ వైడ్ గా మే 1న రిలీజ్ కానుంది. రిలీజ్ కు వారం మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో




ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు మేకర్స్. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న హిట్ 3 కు సెన్సార్ సభ్యులు ఎ సర్టిఫికెట్ అందించారు. సినిమాలో హింస, రక్తపాతం, వైలెన్స్ ఎక్కువగా ఉందని 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసారు. 13 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న వారికి అనుమతి లేదని చిన్న పిల్లలు ఈ సినిమాకు దూరంగా ఉండాలని సూచించింది. నాని స్వయంగా నటిస్తూ నిర్మిస్తున్న సినిమా కావడంతో ప్రమోషన్స్ ను భారీ ఎత్తున జెట్ స్పీడ్ లో చేస్తున్నాడు నాని. ఈ హిట్ సిరీస్ లోని తోలి రెండు బాగాలు హిట్ కావడంతో పాటు- నేచురల్ స్టార్ మోస్ట్ వాయిలెంట్ గా కనిపిస్తుండడం సినిమాకు గ్రాండ్ ఓపెనింగ్ తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ సినిమాపై ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టు-కున్నారు. మరి అంచనాలు హిట్ 3 ఏ మాత్రం అందుకుంటదో మరోక వారం రోజుల్లో తెలుస్తుంది.



# సారంగపాణి జాతకం బాగుంది!

**టాకీస్:** యువ కథానాయకుడు ప్రియదర్శి వరుస సినిమాలతో మంచి ఫామ్‌లో ఉన్నారు. సున్నితమైన కథలు, స్వచ్ఛమైన హాస్యానికి పెట్టింది పేరు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన కామెడీ ఎంటర్‌టైనర్ 'సారంగపాణి జాతకం'. కుటుంబం మొత్తాన్ని థియేటర్‌కి కదిలించేంతగా నవ్వులు ఇందులో పండాయని అంటున్నారు. సారంగపాణి (ప్రియదర్శి) హ్యుందాయ్ కార్ల కంపెనీలో ఓ సేల్స్‌మేన్. రెండేళ్లుగా బెస్ట్ సేల్స్‌మెన్‌గా కొనసాగుతుంటాడు. అదే కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తుంటుంది మైథిలీ (రూప కొడువాయూర్). ఆమె ప్రేమలో ఉన్న సారంగకి చిన్నప్పటి నుంచీ జాతకాలపై నమ్మకం. ఆ రోజు కూడా అద్భుతమైన రోజు అని తెలిశాకే మైథిలీకి తన ప్రేమ విషయం చెప్పాలని ఆఫీస్‌కి బయల్దేరతాడు. మైథిలీయేమో నమ్మకాల్ని పట్టించుకోని ఆధునిక భావాలున్న ఓ యువతి. సారంగ తాను ప్రేమిస్తున్న సంగతిని చెప్పేలోపే మైథిలీ తన మనసులో మాటని చెబుతుంది. దాంతో ఆ ఇద్దరి ప్రేమకథ సుఖాంతమవుతుంది. ఇద్దరికీ వివాహం కూడా నిశ్చయమవుతుంది. ఇంతలో ఓ రోజు పబ్‌లో హస్త సాముద్రికుడైన జిగేశ్వరానంద (అవసరాల శ్రీనివాస్)ని కలుస్తాడు సారంగ. చేయి చూసి భవిష్యత్తులో ఓ మర్డర్ చేస్తావని చెబుతాడు. అసలే జాతకాల్ని అతిగా నమ్మే సారంగ... మర్డర్ భయంతో తన పెళ్లిని వాయిదా వేసుకుంటాడు. జాతకంలో ఎలాగూ ఓ మర్డర్ చేస్తానని ఉంది కాబట్టి... పెళ్లికి ముందే ఆ పనిని పూర్తి చేస్తే తర్వాత తన వైవాహిక జీవితానికి ఏ సమస్యలు రావు కదాని ఓ నిర్ణయానికొస్తాడు. తన చిన్ననాటి మిత్రుడు, తనతోపాటే పనిచేసే చందు (వెన్నెల కిశోర్)తో కలిసి మర్డర్‌కి వ్యూహం పన్నుతారు. వీళ్లు హత్య చేయాలనుకున్న అహోబిల రావు (తనికెళ్ళ భరణి) ఎవరు? అతన్ని హత్య చేశారా లేదా? తదితర విషయాలు సినిమా కథలో భాగంగా వచ్చేవి. కథతో నవ్వించే సినిమాలు తెలుగులో వచ్చి చాలా కాలమైంది. కామెడీ అంటే లాజిక్ లేని సన్నివేశాలు, ద్వంద్వార్థాలతో కూడిన సంభాషణలేనేమో.. అలా కాకుండా ప్రేక్షకుల్ని నవ్వించడం కష్టమేమో అన్నట్టుగా ఈ మధ్య సినిమాలు వస్తున్నాయి. అందుకు భిన్నంగా కథ నుంచే స్వచ్ఛమైన వినోదం పుట్టించే ప్రయత్నం చేశారు.

# కిరణ్ అబ్బవరం సినిమాకు అరుదైన ఘనత

## ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు నామినేట్ అయిన 'క'




**టాకీస్:** టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం అరుదైన ఘనతను అందుకున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ చిత్రం 'క' 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'కు నామినేట్ అయింది. ఉత్తమ చిత్రం విభాగంలో ఈ చిత్రం నామినేట్ అయినట్లు సదరూ సంస్థ ప్రకటించింది. ఢిల్లీ వేదికగా ఈ నెలాఖారున జరుగనున్న వేడుకల్లో విజేతలకు పురస్కారాలు అందించనున్నారు. చిన్న సినిమాగా వచ్చి గతేడాది అక్టోబర్ 31న బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది 'క' చిత్రం. కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సుజీత్, సందీప్ ఇద్దరు దర్శకులు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. కిరణ్ అబ్బవరం సోంత బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమాను చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మించారు. నయన్ సారిక కథానాయికగా నటించింది.

# అల్లు అర్జున్-అట్లీ మూవీలో హీరోయిన్ ఫిక్స్..

## భలే ఛాన్స్ కొట్టేసిందిగా..!



టాకీస్: అల్లు అర్జున్ సినిమాలంటే జనాలలో ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బన్నీ నటించిన పుష్ప2 చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ హిట్ కొట్టింది. ఈ చిత్రం ఏకంగా రూ.1800కోట్లు వసూలు చేసింది. దాదాపు -బాహుబలి 2- రికార్డులను బ్రేక్ చేసింది. క్రియేటివ్ జీనియస్ సుకుమార్‌తో కలిసి సంచలనాలకి తెర లేపిన బన్నీ ఇప్పుడు మరో భారీ సినిమాతో రాబోతున్నారు. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్‌గా, ఇండియాలో ఇప్పటి వరకు రాని జోనర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతుంది. మూవీకి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఇటీవల ముంబై బాంద్రాలోని మోహబూబా స్టూడియోస్ లో అల్లు అర్జున్ లుక్ టెస్ట్, కాన్సెప్ట్ ఫొటో షూట్ జరిగినట్లు సమాచారం. బన్నీ పాత్ర కోసం డైరెక్టర్ అట్లీ డిఫరెంట్ లుక్స్ ట్రై చేస్తున్నట్టు తెలుస్తుంది. రగ్గడ్ నుంచి స్టైలిష్ వరకు ఇలా చాలా ట్రై చేసిన అట్లీ చిత్రంలో అల్లు అర్జున్ ని ఓ భిన్నమైన ఇమేజ్ తో పరిచయం చేయాలని అనుకుంటున్నారట అట్లీ. అంతా అనుకున్నట్లు జరిగితే జూన్ చివరి వరకు చిత్రీకరణ ప్రారంభం కానుందని తెలుస్తుంది. సినిమా తారాగణానికి సంబంధించిన విషయాలను త్వరలోనే వెల్లడించనున్నారు. సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో ఈ మూవీని నిర్మిస్తోంది. ఇందులో కథానాయికగా మృణాల్ ఠాకూర్‌ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తుంది.

ఇటీవల కథని మృణాల్‌కి చెప్పగా, ఆమె ఓకే చెప్పినట్టు సమాచారం. మృణాల్ బన్నీ పక్కన బాగుంటుందని, వారి జోడి చూడముచ్చటగా ఉంటుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మృణాల్‌తో పాటు దీపికా పదుకొణే, జాన్వీ కపూర్ కూడా నటించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వీటిపై అయితే క్లారిటీ రావలసి ఉంది. టైమ్ ట్రావెల్, సూపర్ హీరోలను తలపించేలా ఈ మూవీ ఉంటుందని తెలుస్తుంది. ఏది ఏమైన ఈ సినిమాతో బన్నీ హాలీవుడ్ రేంజ్‌కి కూడా చేరుకుంటాడని సమాచారం.

# ఓటీటీలోకి వచ్చేసిన 'మ్యాడ్ స్క్వేర్'..




టాకీస్: టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ స్క్వేర్. మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాగా.. మొదటి పార్ట్‌లో నటించిన జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్, సంతోష్ శోభన్ సోదరుడు సంగీత్ శోభన్‌తో పాటు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాకు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించగా.. నాగవంశీ నిర్మించాడు. ఏప్రిల్ 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్'లో ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మ్యాడ్ గ్యాంగ్ ఇంజనీరింగ్ కాలేజ్ కథతో ఫస్ట్ పార్ట్ కంప్లీట్ అవ్వడంతో మ్యాడ్ స్క్వేర్ మొదలవుతుంది. కాలేజీ అనంతరం మనోజ్, అశోక్, దామోదర్ (నార్నే నితిన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్) తమకు నచ్చిన పని చేసుకొనే పనిలో ఉంటారు. అయితే ఈ క్రమంలోనే లడ్డుగాడి(విష్ణు)కి పెళ్లి కుదిరినట్లు మ్యాడ్ గ్యాంగ్‌కి తెలుస్తుంది. దీంతో అతడి పెళ్లికి వెళుతుంది ఈ గ్యాంగ్. అయితే పెళ్లికి అన్ని సిద్ధం అనుకుంటున్న సమయంలో లడ్డు పెళ్లి చేసుకోవాల్సిన అమ్మాయి సడన్‌గా లేచిపోతుంది. దీంతో లడ్డుని పట్టుకుని మ్యాడ్ గ్యాంగ్ పెళ్లి కాకుండానే గోవాకి హనిమూన్ ట్రిప్‌కి వెళతారు. అయితే మ్యాడ్ గ్యాంగ్ గోవాకి వెళ్లిన తర్వాత ఏం జరిగింది. గోవాలోని మ్యూజియంలో గోల్డ్ చైన్ దొంగతనం కేసులో ఈ నలుగురు ఎలా ఇరుక్కుపోయారు? గోవాలో లడ్డూ తండ్రి (మురళీధర్ గౌడ్)ను భాయ్ (సునీల్) ఎందుకు కిడ్నాప్ చేశారు? గోవాలో కలిసిన లైలా ఎవరు? అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.